# 1 జానపద 'గోపు'రం

## మనిషి

డా॥ గోపు లింగారెడ్డి



తెలంగాణ రిసోర్స్ సెంటర్

హైదరాబాద్

2011

# జానపద 'గోపురం' డా॥ గోపు లింగారెడ్డి

Janapadha 'Gopuram' Dr. Gopu Lingareddy


| | | |
|---|---|---|
| ప్రచురణ కాలం | : | డిసెంబరు, 2011 |
| Edition | : | December, 2011 |
| ప్రచురణ | : | తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ |
| Published by | : | Telangana Resource Centre, Hyderabad. |
| ప్రచురణ కర్త | : | **ఎం. వేదకుమార్,** చైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Publisher | : | M. Vedakumar, Chairman,<br>Telangana Resource Centre |
| సంపాదకులు | : | **బొనకుర్తి సోమేశ్వర్,** కో-ఆర్డినేటర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Editor | : | Bonakurthi Someshwar, Co-ordinator,<br>Telangana Resource Centre |
| ప్రతులకు | : | **తెలంగాణ రిసోర్స్ సెంటర్**<br>"చంద్రం" 490, స్ట్రీట్ నెం. 11, హిమయత్‌నగర్, హైదరాబాద్.<br>telanganaresource@gmail.com;<br>Mobile : 9030626288<br>దిశ పుస్తక కేంద్రం • సహచర బుక్‌మార్క్ • ధరణి బుక్‌స్టాల్ •<br>నవయుగ బుక్ హౌస్ • నవోదయ బుక్ హౌస్ |
| వెల | : | **రూ. 12/-** |

Printed at :
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

# జానపద 'గోపురం'

## డా॥ గోపు లింగారెడ్డి



తెలంగాణ రిసోర్స్ సెంటర్
హిమాయత్‌నగర్
హైదరాబాద్

# విషయ సూచిక

**ముందుమాట :**

శ్రామిక హృదయాల శ్రమజీవి .................. వేదకుమార్.ఎమ్ ................. 3

శ్రామిక ఉద్యమ గోపురం ........................ బోనకుర్తి సోమేశ్వర్ .............. 4

మూగబోయిన జానపద 'గోపు'రం ............... ఆంధ్రజ్యోతి ....................... 5

నేలకూలిన జానపద గోపురం .................... నమస్తే తెలంగాణ ................ 6

పాటల బాటసారి ................................. పెద్దింటి అశోక్ కుమార్ ......... 7

నిత్య అధ్యయన శీలి 'గోపు'...................... పిట్టల రవీందర్.................... 9

జానపదం, తెలంగాణం రెండు కళ్ళు ............ అన్నవరం దేవేందర్ ............ 12

విద్యుల్లత – విరసం సిటీ యూనిట్ – గోపు.... వరవరరావు ...................... 15

తెలంగాణ జానపద సాహిత్యకారుడు

డా. గోపు లింగారెడ్డి ఇకలేరు .................. సంకేపల్లి నాగేంద్రశర్మ .......... 19

## ముందు మాట

# శ్రామిక హృదయాల శ్రమజీవి

కవి, రచయిత, జానపద సాహిత్య పరిశోధకుడు డా॥గోపు లింగారెడ్డి తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించడమే కాకుండా తెలంగాణ జానపదాన్ని తెలంగాణ ప్రజలకు, ప్రపంచానికి అందచేయడంలో అతని పాత్ర చాలా ఉంది. సాహితీ సంస్థలను ఒక గొడుగు క్రిందకు తెచ్చేందుకు ఆయన చేసిన కృషి తెలంగాణ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు.

జానపదాన్ని ఒకే పరిశోధనా రంగంగా ఎంచుకుని తెలంగాణ శ్రామిక గేయాలపై పరిశోధనలను చేసి శ్రామిక జీవుల పాటలను వెలికితీయడంలో నిర్విరామంగా కృషి చేశారు, నిరంతర శ్రామికుడైనాడు. ఏక కాలంలో ఉద్యమకారునిగా, అధ్యాపకునిగా, అధ్యయనశీలిగా నిరంతరం కృషి చేసిన మంచి మనిషి. వీరిని కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నిర్వహించిన సభలలో నాకు కలిసే అవకాశం దొరికింది. ప్రతి సందర్భంలోనూ కొత్త విషయాలను వెలికితీసేవారు. ఆయన అందించిన స్ఫూర్తి ప్రతి పౌరునికి ఆదర్శప్రాయమైనది, గొప్పది, అనుకరణీయమైనది.

కరీంనగర్ జిల్లా సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన విద్యుల్లత పత్రికను ప్రారంభించింది మొదలు విద్యార్థి సంఘాలు, పౌర హక్కుల సంఘం, విరసం, తెలంగాణ విద్యావంతుల వేదికలో పనిచేసిన ఆయన – తను మంచాన పడేవరకు చేసిన ఉద్యమం, పరిశోధన తెలంగాణ ప్రజానీకానికి ఎంతో చారిత్రక సమాచారాన్ని అందించింది. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు. ఆయనకు తెలంగాణ రిసోర్స్ సెంటర్ శ్రద్ధాంజలి ఘటిస్తూంది.

**వేదకుమార్.ఎమ్**

ఛైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్

## సంపాదకీయం

# శ్రామికుల ఉద్యమ గోపురం

సామాజిక విలువలపట్ల, యువత భవితవ్యం పట్ల శ్రద్ధాశక్తులు ఉన్న అన్వేషి గోపు లింగారెడ్డి. శ్రామికుల భాష సజీవమై, సహజమై, సూటి మాటలతో ఎంతో సుందరంగా ఉంటుందో సమాజానికి తెలియజెప్పిన శ్రమజీవి. హృదయాంతరాళం నుంచి విడమర్చి చెప్పిన పాటలను, శ్రమజీవుల సొంతమైన పాటలను విశ్లేషించి ప్రజల చేతికి ఒక పనిముట్టుగా అందించాల్సిన అవసరాన్ని గుర్తెరిగిన శ్రీ గోపు లింగారెడ్డి తెలంగాణ ప్రాంతమంతా పర్యటించి తెలంగాణ శ్రామిక గేయాలను సేకరణచేసి, గ్రంధంగా అందించారు.

టి.వి. ప్రవేశం వల్ల రీడింగ్ హాబిట్ అడుగంటి మనిషి సృజనాత్మకమైన ఆలోచనా సరళికి దూరమవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసినా, సినిమాకు సామాజిక బాధ్యత ఉన్నదని నమ్మకంతో... అధ్యాపక వృత్తితో (పాత్రలలో) వికృత చేష్టలు చేయిస్తున్నవారిని మందలించిన ఆయనకు ఆయనే సాటి.

ఆయన రచించిన చిన్నతెర చిత్రాలు, తెలంగాణ శ్రామిక గేయాలు, వెండితెర వెలుగు నీడలు...ప్రజలకు ఆయన అందించిన సంపద. ఆ సంపదను కాపాడుకుంటు, ఆయన్ని స్మరిస్తూ...

జోహార్లు.. గోపు లింగారెడి, జోహార్.

**బోనకుర్తి సోమేశ్వర్**

సంపాదకులు.

# మూగబోయిన జానపద 'గోపు'రం

కవి, రచయిత, జానపద సాహిత్య పరిశోధకుడు డాక్టర్ గోపు లింగారెడ్డి (61) ఆదివారం రాత్రి కరీంనగర్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కరీంనగర్ జిల్లా తెలంగాణ విద్యావంతుల వేదిక స్థాపకుల్లో క్రియాశీలక పాత్ర వహించిన ఆయన రెండేళ్లపాటు ఆ సంస్థకు అధ్యక్షునిగా కొనసాగారు. తెలంగాణ భావ వ్యాప్తి కోసం అహర్నిశలు శ్రమించి అందులోనే నిమగ్నమై ఉన్న కాలంలోనే 2009 ఫిబ్రవరి 14న సెరబ్రల్ హెమరేజ్‌తో కోమాలోకి వెళ్ళారు. ఏడాదిన్నరపాటు కోమాలోనే ఉన్న లింగారెడ్డి కొంత కోలుకొని మనుషులను గుర్తుపట్టే స్థితికి వచ్చారు. 1974లో ప్రముఖ కవి శ్రీశ్రీ అధ్యక్షతన ఏర్పడిన పౌరహక్కుల సంఘానికి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా లింగారెడ్డి ఎన్నికయ్యారు. 1970 జూలై 4 న ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘం (విరసం) లో వ్యవస్థాపక సభ్యుడై హైదరాబాద్ సిటీ విరసం యూనిట్‌కు నాలుగు సంవత్సరాలు కన్వీనర్‌గా పనిచేశారు. 1979లో కరీంనగర్ జిల్లాలోని కవులు, రచయితలతో కలిసి వికాస సాహితీ అనే సంస్థను స్థాపించారు. 1990 లో కరీంనగర్ జిల్లాలోని సాహితీ సంస్థలన్నింటినీ ఒకే వేదిక పైకి తీసుకువచ్చి సాహితీ గౌతమిని స్థాపించారు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూనే ఆ ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తి శ్రీశ్రీ తదితర కవులతో పరిచయంతో భాగ్యనగర్ విజయ్‌కుమార్, వెంకటరెడ్డితో కలిసి విద్యుల్లత సాహితీ మాస పత్రికను ప్రచురించారు. తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ లెక్చరర్ల ఫోరం, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం ఏర్పాటులో ప్రముఖ పాత్ర వహించారు. ప్రాణమున్నంత వరకు తెలంగాణ ధ్యాసే శ్వాసగా బతికారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం అలకాపురి కాలనీలోని శ్మశానవాటికలో ఉదయం 11 గంటలకు జరగనున్నాయి.

01.11.2011
ఆంధ్రజ్యోతి

# నేలకూలిన జానపద గోపురం

జానపద గోపురంగా ప్రసిద్ధిగాంచిన కవి, రచయిత డాక్టర్ గోపు లింగారెడ్డి(61) ఆదివారం అర్ధరాత్రి కరీంనగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఫిబ్రవరి12, 2009న బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానపడ్డ ఈ 'పాటల బాటసారి' మృత్యువుతో పోరాడి కానరాని లోకాలకు వెళ్ళిపోయారు. గోపు లింగారెడ్డి మే 1, 1950లో తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లో మల్లారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. జమ్మికుంటలో డిగ్రీ చేస్తున్నప్పుడు జీవగడ్డ విజయ్ కుమార్, వి.వెకట్‌రెడ్డితో కలసి 'విద్యుల్లత' పత్రికను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం విద్యార్థులే నిర్వహించిన మొదటి పత్రిక ఇదే. అప్పట్లో ఈ పత్రిక కరీంనగర్ జిల్లా సాహిత్యానికి ఎనలేని సేవ చేసింది. 1970లో ఆవిర్భవించిన విరసం (విప్లవ రచయితల సంఘం)లో సభ్యుడిగా చేరారు. 1975లో ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా చేరి, 1978లో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలకు బదిలీపై వచ్చి తెలుగు విభాగాధిపతిగా పనిచేశారు. ఏప్రిల్ 30, 2008లో పదవీ విరమణ పొందేవరకు ఇక్కడె ఉన్నారు. తెలంగాణ శ్రామిక గేయాలు అనే అంశంపై పరిశోధన చేసి 1980లో డాక్టరేట్ పొందారు. 1982లో 'తెలంగాణ శ్రామిక గేయాలు' వివిధ విశ్వ విద్యాలయాలకు రిఫరెన్స్ పుస్తకంగా పనిచేసింది. రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్యకోసం లింగారెడ్డితో 'బతుకమ్మ పండుగ' అనే పుస్తకం రాయించి ముద్రించింది. 1990లో 'సాహితీ గౌతమి'ని స్థాపించిన గోపు, కరీంనగర్ జిల్లాలోని అనేక సాహితీ సంస్థల్ని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు. 1991లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. తొలి నాళ్ళలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌లో, పీడీఎస్‌యూ, ఆర్ఎస్‌యూలో పనిచేశారు. 2001 నుంచి కేసీఆర్ నేతృత్వంలో ఊపందుకున్న తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మంచాన పడేవరకు తెలంగాణ విద్యావంతుల వేదిక కన్వీనర్‌గా పనిచేశారు.

01.11.2011

నమస్తే తెలంగాణ

# పాటల బాటసారి

తెలంగాణ తొలితరం మలితరం ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన గోపులింగారెడ్డి కరీంనగర్ జిల్లా అలుగునూరు గ్రామంలో 1950 లో మల్లారెడ్డి బుచ్చమ్మ దంపతులకు జన్మించాడు. పౌరహక్కుల నేత జాపలక్ష్మారెడ్డి పరిచయం లింగారెడ్డి జీవితాన్ని మార్చేసింది. అతన్ని ప్రజల మనిషిని చేసింది. విరసం స్థాపక సభ్యునిగా, సాహితీ గౌతమి వ్యవస్థాపక సభ్యునిగా కఫిసో స్థాపక సభ్యునిగా కొనసాగిన లింగారెడ్డి చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలు కలవాడు. 1969లో సైన్స్ విద్యార్థిగా ఏ కళాశాలలో పట్టా తీసుకున్నాడో 2008లో అదే కళాశాలలో పదవీ విరమణ చేసాడు. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో లింగారెడ్డి ఇతరులకు సాధ్యంకాని ఎన్నో మైలురాళ్లను దాటాడు. సైకిల్ మీద తెలంగాణలోని అన్ని గ్రామాలు తిరిగి టేపు రికార్డరు పట్టుకొని ప్రజల నుంచి పాటలను సేకరించాడు. 'తెలంగాణ శ్రామిక గేయాలు' అన్న అంశం మీద ఎం.ఫిల్, పి.హెచ్.డి పట్టా పొందారు. ప్రజలన్నా ప్రజల భాషన్నా శ్రమజీవనమన్నా లింగారెడ్డికి ఎక్కువ మక్కువ. ఆదర్శ భావాలతో 1974 లోనే ఆదర్శ వివాహం చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లాలోనే అది మొదటి ఆదర్శ వివాహం. సిద్ధిపేటలో జరిగిన ఈ వివాహానికి గద్దర్, వివి, జ్వాలాముఖి, చెరబండరాజులు హాజరయ్యారు. మొదటి దశ తెలంగాణ ఉద్యమం తర్వాత విద్యార్థి ఉద్యమాల పట్ల ఆకర్షితుడైన లింగారెడ్డి జార్జిరెడ్డితో కలిసి వామపక్ష విద్యార్థి ఉద్యమాలను నిర్మించాడు. డి.ఎస్.ఒ.లో, పిడియస్‌యు, ఆర్‌ఎస్‌యులలో సభ్యుడిగా కొనసాగుతూ ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. తెలంగాణ జిల్లాల్లో ఏడు సంవత్సరాలు శ్రమించి రెండు వేల జానపద గేయాలను సేకరించడం, తర్వాత కరీంనగర్ జిల్లా గ్రామ గ్రామం తిరిగి సేకరించిన పాటలతో 'కరీంనగర్ జిల్లా జానపద గేయాలు' పుస్తకం ప్రచురించడం లింగారెడ్డికి ప్రజల పాటల మీదున్న మమకారానికి నిదర్శనం. తర్వాత 'తెలంగాణ శ్రామిక గేయాలు' పరిశోధనా గ్రంధాన్ని ప్రచురించాడు. తర్వాత జానపదుల పాటల మీద జీవితం మీద అనేక వ్యాసాలు రాసాడు. కళాశాలలో వయోజన విద్యా విభాగం కన్వీనర్‌గా ఉండి ఆరెపల్లి అనే గ్రామాన్ని దత్తత తీసుకుని సంపూర్ణ అక్షరాస్యతా గ్రామంగా తీర్చిదిద్దాడు. లింగారెడ్డిలో అణువణువునా చైతన్యం

ఉంది. అడుగడుగునా పోరాటం ఉంది. సాహిత్యంతో పెనవేసుకున్న ఆరాటం ఉంది. గుండెనిండా పల్లెతనం ఉంది. 1969లో విద్యార్థిగా ఉన్నప్పుడే విజయ్‌కుమార్ వెంకటరెడ్డిలతో కలిసి 'విద్యుల్లత' అనే సాహిత్య పత్రికను తెచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు నడిపిన మొట్టమొదటి పత్రిక అది. తర్వాత ఆనాటి పోరాటాలను రికార్డు చేస్తూ 'బద్‌లా' కథల సంకలనం తెచ్చాడు. ఇప్పటికీ ఆ సంకలనం రచయితలకు పాఠ్యపుస్తకం. విద్యుల్లత, బద్‌లా సాహిత్యంలో నిలిచిపోయే ప్రచురణలు. లింగారెడ్డి మట్టిమనిషి. తాను పుట్టి పెరిగిన నేలపైన భాషపైన అంతులేని అభిమానం ఉన్నవాడు. అందుకే 'జానపద కళా పరిశోధన' వేదికకు అధ్యక్షునిగా కొనసాగి ఉద్యమానికి ఊపిరిగా నిలిచాడు. పదవీ విరమణ తర్వాత రెండేళ్ళుగా కోమాలో ఉన్న లింగారెడ్డి, ఉత్తమ అధ్యాపకుడు, అభ్యుదయవాది, సాహితీవేత్త మాత్రమే కాదు. ఒక జానపద కళాగోపురం, ఒక పాటల బాటసారి.

**-పెద్దింటి అశోక్‌కుమార్**

01.11.2011
ఆంధ్రజ్యోతి

మనిషి ఎంత మంచివాడు!
చనిపోయినవాని చెడును
వెనువెంటనే మరుస్తాడు
కాని మంచినే తలుస్తాడు

మనిషి ఎంత చెడ్డవాడు
బ్రతికి ఉన్నవాని మంచి
గుర్తించడు కాని వాని
చెడును వెతికి కెలుకుతాడు

**- ప్రజా కవి కాళోజీ**

# నిత్య అధ్యయన శీలి 'గోపు'

తెలంగాణ విద్యావంతుల వేదికను కరీంనగర్ జిల్లాలో విస్తరించే క్రమంలో డాక్టర్ గోపు లింగారెడ్డితో నాకు సాన్నిహిత్యం పెరిగింది. అనేక వేదికలను కలిసి పంచుకున్నాం అనేక అంశాలపైన మిత్ర వైరుధ్యంతో ఘర్షణపడ్డాం. అయినా తెలంగాణ ఉద్యమ భావవ్యాప్తిలో దాదాపు మూడు సంవత్సరాలపాటు విద్యావంతుల వేదికలో కలిసి పయనించాం. అనారోగ్యంతో గోపు లింగారెడ్డిగారు మంచాన పడ్డాక 'వేదిక' ఆయన లోటును గుర్తుకుచేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ భావవ్యాప్తిలో గోపులింగారెడ్డి నిర్వహించిన పాత్రను స్మరించుకోవడం ఉద్యమ సహచరునిగా నా కనీస బాధ్యత.

తెలంగాణ విద్యావంతుల వేదిక, కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్షునిగా బాధ్యతలను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించిన గోపు లింగారెడ్డి హయాంలో అనేక చారిత్రాత్మకమైన కార్యక్రమాలను వేదిక నిర్వహించింది. అందులో ముఖ్యంగా 2006 అక్టోబర్ 14 తేదీన విద్యావంతుల వేదిక నిర్వహించిన 'కరీంనగర్ ధూం ధాం' కీలకమైనది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 'కరీంనగర్ ధూం ధాం' సభ మలుపు లాంటిది. కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా, కేంద్రమంత్రిగా పదవిలో వున్న తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్‌రావు రాజీనామా నేపథ్యంలో ఆ సభ జరిగింది. అంతకు ముందు రెండేళ్ళపాటు నిరంతరాయంగా తెలంగాణ ఉద్యమ భావవ్యాప్తిని నిర్వహిస్తున్న తెలంగాణ విద్యావంతుల వేదిక ఈ సభా నిర్వహణ బాధ్యతను నెత్తికెత్తుకున్నది. సభా నిర్వహణకు అవసరమైన గ్రౌండ్, పోలీస్ పర్మిషన్ సాధించడం అప్పుడున్న రాజకీయ పరిస్థితులలో కత్తిమీద సాములాంటిదే అయ్యింది. ఈ రెండు అనుమతులను సాధించే బాధ్యతలను గోపులింగారెడ్డి నిర్వహించారు.పోలీసు వేధింపులను ఆయన ఈ సందర్భంగా ఏమాత్రం లెక్క చేయకుండా రేయింబవళ్ళు కష్టపడి పనిచేశారు. దాదాపు ఇరవై రోజులు పోస్టర్లు, కరపత్రాలను పంచుతూ, స్థానిక కమిటీ నాయకత్వాలను ఉత్తేజపరుస్తూ జిల్లా వ్యాప్తంగా మాతో పాటు కలిసి తిరిగారు. పోలీసు యంత్రాంగం తీవ్రమైన నిర్బంధం ప్రయోగించినప్పటికీ, ప్రజలు స్వచ్ఛందంగా ధూం ధాం సభకు వేలాదిగా తరలివచ్చారు.

ఆర్టీసీ బస్సులను బంద్ చేసినప్పటికీ, ట్రాక్టర్లపైనా, ఎడ్లబండ్లపైనా ప్రజలు ఈ సభకు చేరుకున్నారు. పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ గద్దర్ నాయకత్వంలో కళాకారుల ఊరేగింపు సర్కస్ గ్రౌండ్ చేరుకునే సమయానికి సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనేక జిల్లాల నుంచి వేలాదిమంది ఉద్యమకారులు, ఉద్యమ నాయకులు ఈ సభకు తరలి వచ్చారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో చంద్రశేఖర్‌రావు సుమారు రెండు లక్షల మెజారిటీతో గెలుపొందడానికి 'కరీంనగర్ ధూం ధాం' సభ ఎంతగానో దోహదపడిందనడంలో ఎలాంటి సందేహాలకు తావులేదు.

శాతవానుల తొలి రాజధానిగా దాదాపు నాలుగు వందల సంవత్సరాలపాటు విరాజిల్లిన కోటిలింగాల పరిరక్షణ విషయంలోనూ తెలంగాణ విద్యావంతుల వేదిక కృషిలో గోపులింగారెడ్డి భాగస్వామ్యం ఉన్నది. జిల్లా కమిటీ పక్షాన కోటిలింగాల ప్రాంతాన్ని పర్యటించిన విద్యావంతుల బృందంలో ఆయన కూడా ఉన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో కోటిలింగాలు మునిగిపోయే ప్రమాదం ఉన్నదని బాహ్య ప్రపంచానికి చాటిచెప్పింది విద్యావంతుల వేదికే. హైదరాబాద్ నుంచి కోటిలింగాల వరకు బస్సు యాత్రను ఏర్పాటు చేసింది. మేధావులను, జర్నలిస్టులను, చరిత్రకారులను, తెలంగాణ ఉద్యమకారులను కోటిలింగాలకు తీసుకెళ్ళి అక్కడ ఒక బహిరంగ సభను కూడా  వేదిక తరపున నిర్వహించాం. కోటిలింగాల పరిరక్షణలో రాజకీయ నాయకులను కదిలించగలిగాము. ఈ చారిత్రక ప్రదేశం పరిరక్షణకు విద్యావంతుల వేదిక చేసిన ప్రయత్నంలో గోపులింగారెడ్డి కూడా ముఖ్య పాత్ర వహించారు. అనేకమంది వ్యక్తులు, ప్రముఖులు, సంస్థల ఆందోళనల ఫలితంగానే ఇవ్వాళ కోటిలింగాల విషయంలో ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఆ కృషిలో ఆయనకూ భాగస్వామ్యం ఉన్నది. ప్రభుత్వం కరీంనగర్‌లో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి పూనుకున్న సందర్భంలో దాని పేరు విషయంలోనూ గోపు లింగారెడ్డి తీవ్రమైన వ్యక్తం చేశారు. ఇక్కడి విశ్వవిద్యాలయానికి ఇందిరాగాంధీ పేరును ఖరారు చేసినప్పుడు ఆయన తన గొంతెత్తి నినదించారు. నిరసన స్వరాన్ని వినిపించారు. విద్యావంతుల వేదిక పక్షాన ముఖ్యమంత్రి నుంచి మొదలుకొని స్థానిక శాసనసభ్యుల వరకూ స్వయంగా కలిసి విజ్ఞాపన పత్రాలను అందించారు. సీమాంధ్ర ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలకు ఆ ప్రాంతానికి చెందిన స్మరణీయుల పేర్లను ఖాయం చేస్తున్నప్పుడు తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయాలకు రాజకీయ నేతల పేర్లు ఎందుకని గోపు లింగారెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయానికి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంగానూ, కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్న దానికి ఇందిరాగాంధీ విశ్వవిద్యాలయంగానూ పేర్లు ఖరారు చేయడాన్ని ఆయన

తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా జిల్లాకు చెందిన రాజకీయ నాయకులను, మేధావులను కదిలించారు. కరీంనగర్‌లో రాజశేఖర్‌రెడ్డి ప్రారంభోత్సవానికి వస్తున్న తరుణంలో గోపు లింగారెడ్డి తీవ్రస్థాయిలో చేసిన ప్రయత్నాల ఫలితంగా రాత్రికి రాత్రి ప్రభుత్వం దానికి శాతవాహన విశ్వవిద్యాలయంగా పేరు మార్చి ప్రారంభించవలసి వచ్చింది. కరీంనగర్ జిల్లా ఆత్మగౌరవాన్ని నిలబెట్టడంలో గోపు లింగారెడ్డి నిర్వహించిన పాత్ర విస్మరించరానిది.

గోపు లింగారెడ్డి ఏకకాలంలో ఉద్యమకారునిగా, అధ్యాపకునిగా, అధ్యయనశీలిగా నిరంతరం కృషి చేశారు. ప్రతి సందర్భంలోనూ కొత్త విషయాలను తవ్వి తీసేవారు. ఆయన అందించిన స్ఫూర్తి చాలా గొప్పది. అనుసరణీయమైనది. ఆయన జీవితం చలనశీలమైనది. తెలంగాణా విద్యావంతుల వేదిక పక్షాన ఆయనకు నివాళి.

**– పిట్టల రవీందర్**

తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి

## వొద్దొద్దు......

అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయకం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు నాకు ఆరాధ్యుడు

**– ప్రజా కవి కాళోజీ**

# జానపదం, తెలంగాణం రెండు కళ్ళు

డాక్టర్ గోపు లింగారెడ్డికి జానపద విజ్ఞానం తెలంగాణవాదం రెండూ పెయ్యి పులకరించిపోయే విషయాలు. జానపద పరిశోధనలో ఆచార్య బిరుదు రాజు రామరాజు తర్వాత లింగారెడ్డిది ఎన్నదగిన స్థానం. తెలంగాణ ఉద్యమ వ్యాప్తిలోనూ కార్యశీలి. కరీంనగర్ జిల్లాకు చెందిన గోపు లింగారెడ్డి విప్లవ వామపక్ష పౌరహక్కుల సాహిత్య సాంస్కృతిక సంస్థల నిర్వహణే కాదు ఆయా సంస్థల వ్యవస్థాపనలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన అక్టోబర్ 30 రాత్రి కరీంనగర్‌లో మృతిచెందారు. గోపు లింగారెడ్డి కరీంనగర్ సమీపంలోని అల్గునూర్‌లో మే 1, 1950న మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో 2008లో లెక్చరర్‌గా పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14 2009లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి అప్పటి నుంచి అచేతనంగా ఉన్నారు.

మొదట ఆయన 'కరీంనగర్ జిల్లా జానపదగేయాలు' పుస్తకాన్ని వెలువరించారు. 1982లో 'తెలంగాణ శ్రామిక గేయాలు' పుస్తకాన్ని ప్రచురించారు. ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధించిన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథం. దాదాపు ఏడు సమవత్సరాలు తెలంగాణలో అన్ని జిల్లాలు టేప్‌రికార్డర్ పట్టుకొని ఎడ్లబండ్లు, సైకిళ్ళపై తిరిగి జానపద పాటలను సేకరించారు. ఈ సిద్ధాంత వ్యాసం చాలా మౌలిక పరిశోధన అని ఆరుద్ర ప్రశంసించారు. ఈ పుస్తకం 2008లో పునర్ముద్రణ పొందింది. తర్వాత 1982లో 'జానపద విజ్ఞానం సేకరణ అనుభవాలు' అనే పుస్తకం వెలువరించారు. ఇది జానపద పరిశోధకులకు ఉపయుక్తమైన గ్రంథం. 1986లో 'స్టడీస్‌ఇన్‌ఫోక్‌లో రాస్టిక్స్' అనే ఆంగ్లపుస్తకం ఆర్‌వీఎస్ సుందరం, జీయస్ మోహన్‌తోకలిసి వెలువరించారు. 1996లో వయోజనుల కోసం 'బతుకమ్మ పండుగ' అనే పుస్తకం, 2004లో 'పాటల బాటసారిగా' అనే పుస్తకం వెలువరించారు. ఇది తన జానపద పరిశోధన అనుభవాల నేపథ్యంలో వచ్చిన పుస్తకం. ఇది 2007లో పునర్మురదణ పొందింది. 2005లో 'చిన్నితెరచిత్రాలు', 2007లో 'వెండి తెర వెలుగు నీడలు', టీవీ, సినిమాల మీద వ్యాసాల పుస్తకం వెలువరించారు. పదవీ విరమణ తర్వాత ప్రత్యేక సంచికగా 'జానపద గోపురం'

వెలువరించారు. 1968-69లో జమ్మికుంట ఆదర్శ కళాశాలలో చదువుతున్నపుడే గోపు లింగారెడ్డి వామపక్ష రాజకీయాలతో ప్రభావితులయ్యారు. అప్పుడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అంతకు ముందు అల్గునూర్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే జాప లక్ష్మారెడ్డి ద్వారా కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావం పడింది. 1969లోనె బి.విజయ్‌కుమార్, వి.వెంకటరెడ్డిలతో కలిసి 'విద్యులత' అనే సాహిత్య పత్రికను నిర్వహించారు. మొదటి సంచికకు లింగారెడ్డి సంపాదకులుగా ఉన్నారు. ఈ పత్రిక 20 సంచికల దాకా వచ్చింది. ఈ తర్వాత 'బద్‌లా' కథల సంకలనం, 'రెక్కవిప్పిన రెవెల్యూషన్' వెలువరించారు. ఈ 'విద్యుల్లత' సంపాదకులే విశాఖపట్నంలో 1969లో శ్రీశ్రీ షష్ఠిపూర్తి సభకు వెళ్ళి శ్రీశ్రీ ఎవరివైపు? అనే కరపత్రం వెలువరించారు. ఆ తర్వాత జూలై 4, 1970లో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావంలో గోపు లింగారెడ్డి పాలు పంచుకొని వ్యవస్థాపక కార్యవర్గంలో ఒకరుగా ఉన్నారు. ఆ తర్వాత అదే సంస్థకు హైదరాబాద్ సిటీ కన్వీనర్‌గా నాలుగేళ్ళు పనిచేశారు. ఉస్మానియాలో ఎంఎ చదువుతున్నప్పుడు జార్జి రెడ్డి స్నేహంతో పీడీయస్‌యులో పనిచేశారు. ఆ తర్వాత రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌యస్‌యు) ఆవిర్భావంలోనూ కీలకపాత్ర పోషించారు. అంతే కాకుండా 1974లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపీసీఎల్‌సీ) వ్యవస్థాపనలో ఉండి సహాయ కార్యదర్శిగా పనిచేశారు. 'విరసం' సిటీ యూనిట్‌లో పనిచేస్తున్నప్పుడు 'బుల్లెట్' అనే బులిటన్ ప్రచురించారు. ఆయన వ్యసాయ కుటుంబం నుంచి పల్లె నుంచి వచ్చినందునేమో వామపక్ష విద్యార్థి సంస్థలతో సంబంధం కొనసాగిస్తూనే జానపద పాటల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఉస్మానియాలో లింగారెడ్డికి జీయస్ మోహన్, రావి ప్రేమలత, జనార్ధన్‌భట్, సుమతి, సరస్వతీ, వసుంధరలు జానపద విజ్ఞానం ఐచ్ఛికాంశంలో సహాధ్యాయులు, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్ అనే సంస్థను స్థాపించారు. దానికి నిరుదురాజు రామరాజు అధ్యక్షు డు. లింగారెడ్డి ప్రధాన కార్యదర్శిగా కృషి చేశారు. అప్పుడే 'జానపద సరస్వతి' అనే పత్రికను వెలువరించారు. 1973లో హైదరాబాద్ నలందా పాఠశాలలో ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించిన లింగారెడ్డి తర్వాత 1975 నుంచి ఎల్లందు, జహీరాబాద్, బోథ్, కరీంనగర్‌లో లెక్చరర్‌గా పనిచేసి 2008లో ఉద్యోగ విరమణ పొందారు. తర్వాత కాలంలో తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక ఆవిర్భావంలో కృషి చేశారు. తెలంగాణ విద్యావంతుల వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. రచయితల వేదికకు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు. కరీంనగర్‌లో 1990లో 'సాహితీ సంస్థల' సమాఖ్య 'సాహితి గౌతమి'ని ఏర్పాటు చేసి వ్యస్థాపక అధ్యక్షునిగా కొనసాగారు. వికాస సాహితి, కరీంనగర్

వినియోగదారుల మండలి, పీటీ రెడ్డి కళాపరిషత్, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నిర్మాణంలో లింగారెడ్డి పాత్ర తక్కువ చేయలేము. కరీంనగర్‌లో 1985 ప్రాంతంలో జీవగడ్డ పత్రిక వెలువడినప్పుడు లింగారెడ్డి జానపద విషయాలపై ఒక 'కాలమ్' నిర్వహించారు. బి.విజయకుమార్ సారథ్యంలో వచ్చిన 'జీవగడ్డ' పత్రిక ఎందరికో వృత్తి జీవితాలకు పెద్ద దర్వాజగా నిలిచింది. అందులో అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, కెయన్‌చారి, ఎన్ శ్రీనివాస్, పిట్టల రవీందర్ కలుసుకుని రాతలు, రాజకీయాలు నేర్చుకున్న వేదిక. తెలంగాణ భాషా పదాలు ఇప్పుడు నిరభ్యంతరంగా రాస్తున్నాము గాని అప్పుడు ఎక్కువగా లింగారెడ్డి తన 'కాలమ్' లోనే రాసేవారు. 2000 తర్వాత తెలంగాణ ఉద్యమం వచ్చినంక లింగారెడ్డి పట్టపగ్గాలు లేకుండా తిరిగేది. తెలంగాణ విద్యావంతుల వేదిక సభలను అంతకముందు ఐక్యవేదిక సభలను జిల్లా అంతా తిరిగి నిర్వహించేది. ఆయన కారు వెనుక అధ్యక్షులు 'తెలంగాణ విద్యావంతుల వేదిక' అని బాజాప్తా ఎర్ర స్టిక్కర్‌తో రాయించుకునేవారు. లింగారెడ్డిని ఇదేం గవర్నమెంట్ నామినేటెడ్ ఛైర్మన్ గిరినా! అని మిత్రులెవరైనా అన్నా పట్టించుకోకుండా తను అనుకున్నది చేస్తుండేవారు. లింగారెడ్డి ఎక్కువగా మౌనంగానే ఉండేవారు. సందర్భోచితంగా గొప్ప హాస్యరసం కుమ్మరిచ్చేది. ఆయనతోపాటు తెలంగాణ రచయితల వేదిక 'పాపికొండల యాత్ర'కు పోయినా నాగార్జున సాగర్‌లో 'సృజన సంగమం'కు ప్రయాణం చేసినా కడుపుబ్బనవ్వించే సరస జోకులు వేసేవాడు, ఆయన స్నేహానికి చిన్నా పెద్దా లేదు. అందరితో సమానంగానే ఉండేది. ఆయన విద్యార్థులను కూడా సమాన స్థాయిలో గౌరవించేవారు. గోపులింగారెడ్డికి అరుణతో 1974లో ఆదర్శ వివాహం (స్టేజీ పెళ్ళి) అయ్యింది. పెళ్ళికి వరవరరావు, చెరబండ రాజు, జ్వాలముఖి, గద్దర్‌లు హాజరయ్యారు. ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు విదేశాల్లోనే ఉద్యోగాలు చేస్తున్నారు. గోపు లింగారెడ్డి మృతి జానపద సాహిత్యానికి, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటు. ఆయన కరీంనగర్ జిల్లాలోనైతే ఎన్నో సాహిత్య సాంస్కృతిక కళా సంస్థలతో కలిసి పనిచేశారు. తెలంగాణ ఒక బహుముఖ ప్రజా ఉద్యమ సంబంధం గల వ్యక్తిని కోల్పోయింది.

**– అన్నవరం దేవేందర్**

01.11.2011
నమస్తే తెలంగాణ

# విద్యుల్లత - విరసం సిటీ యూనిట్ - గోపు

పన్నెండు చేతులతో పనిచేసే గోపు లింగారెడ్డి నిష్క్రియాపరుడై పోయి రెండున్నరేళ్ళు గడిచిపోయినవి. 2009 ఫిబ్రవరిలో హఠాత్తుగా కోమాలోకి వెళ్ళిపోయి, నిరంతరం మృత్యువుతో పోరాడుతూ మళ్ళీ మాట, కాళ్ళు, చేతులు కూడదీసుకుంటుండగా గుండె ఆగి చనిపోయాడు. అన్ని పనులకు సెలవు ఇచ్చి విశ్రాంత జీవితంలోకి, కాదు జీవన వ్యాపకాల నుంచే శాశ్వత శాంతిలోకి వెళ్ళిపోయాడు. విద్యుల్లతతో, విరసంతో, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంతో మా అనుబంధం కళ్ళముందు కదలాడింది. ఇద్దరమూ తెలుగు అధ్యాపకులుగా కాకతీయ విశ్వవిద్యాలయ  అనుబంధ కళాశాలల్లో పనిచేసాం కానీ, నాకన్నా పదేళ్ళు చిన్నవాడు.

నేను సికెఎం కాలేజీలో చేరిన కొత్తలోనే 'త్రీ మస్కటీర్స్'గా మేము తర్వాత నామకరణం చేసిన బి.విజయకుమార్ గోపు లింగారెడ్డి, ఉమ్మెంతల వెంకటరెడ్డితో పరిచయమై అది ఎమర్జెన్సీ విధించే దాకా గాఢానుబంధంగా కొనసాగింది. ఈ ముగ్గురు అప్పుడు జమ్మికుంట ఆదర్శ కళాశాల విద్యార్థులు. అంటే కథలు, నాటికలు, బతుకు, జీవన సమరం నవలలు రాసిన సుప్రసిద్ధ రచయిత ఎంవి తిరుపతయ్య ప్రత్యక్ష శిష్యులు. తిరుపతయ్య అంటే వరంగల్ 'మిత్ర మండలి' కన్వీనర్‌గా, సృజన సాహితీ మిత్రునిగా ప్రారంభమై జమ్మికుంట ఆదర్శ కళాశాలలో తన సుతిమెత్తని, అనితర సాధ్యమైన పాఠాలతో, అంతస్రవంతి వంటి సాహిత్య సాంస్కృతిక ఆచరణతో ఆ కళాశాలలో నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), మాసాని రవీందర్, తిరుపతి, నేలకొండ రజిత వంటి ఎందరో విప్లవ విద్యార్థులను ఓపికగా మలచినవాడు. చిరునవ్వుతో, చేతిలో సిగిరెట్‌తో జమ్మికుంట కళాశాలను అక్షరాలా 'విద్యుల్లత'గా విప్లవాకాశంలోకి విస్తరింపచేసినవాడు. ఆయన కనుసన్నల్లో ఆయన గైడెన్స్ తో 1969లో అటు శ్రీకాకుళం పోరాటం, ఇటు కె.కె. డబ్ల్యు (ఖమ్మం, కరీంనగర్, వరంగల్) ప్రత్యేక తెలంగాణోద్యమం రెక్కలు విప్పుతున్న కాలంలో ఈ 'త్రీ మస్కటీర్స్' విద్యుల్లతను ప్రారంభించారు. బి. విజయ్‌కుమార్ సంపాదకుడు. ఆయన తండ్రికి కరీంనగర్ మంకమ్మతోటలో ప్రింటింగ్ ప్రెస్ ఉండేది. విరసం ఏర్పడే నాటికే ఈ బృందం చాలా సాహసాలు చేసింది. తెలంగాణ ఉద్యమానికి

ఫ్రెంచి విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రేరణ ఇవ్వడానికి 'రెక్క విప్పిన రెవల్యూషన్' శ్రీశ్రీ అనువాదాన్ని ప్రచురించడం, 'ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేడు కవి' అని విరసం ఆవిర్భావాన్ని నిర్వచిస్తూ 1970 జూలై 4న, 'మార్చ్' కవితా సంకలనాన్ని వెలువరించడం మాత్రమే కాదు. వరంగల్, కరీంనగర్‌ల నుంచి కరపత్రాలు వేసుకొని వచ్చిన విప్లవ సాంస్కృతిక కార్యకర్తల్లో ఈ ముగ్గురూ ఉన్నారు. అట్లా ఈ ముగ్గురూ విరసం సంస్థాపక సభ్యులయ్యారు. ఖమ్మం సుబ్బారావు పాణిగ్రాహి నగర్‌లో జరిగిన విరసం ప్రథమ మహాసభల్లో బి.విజయ కుమార్ 'విద్యుల్లత' సంపాదకుడుగా విరసం క్యావర్గ సభ్యుడై వరంగల్‌లో రెండవసారి జరిగిన సాహిత్య పాఠశాల (1979) దాకా కొనసాగాడు. 'మార్చ్' కవితా సంకలనం పెండ్యాల కిషన్‌రావు సంపాదకత్వంలో వరంగల్‌లో రూపొందినా అచ్చుయింది మాత్రం కరీంనగర్‌లో బి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలోనే అందుకోసమూ, ఆ తర్వాత వెలువడిన తాడిగిరి పోతరాజు గారి 'ఎర్రబుట్ట' కథ కోసం నిషేధింపబడిన 'బద్‌లా' కథా సంకలనం కోసమూ, ఎమర్జెన్సీ దాకా అన్ని రకాల విప్లవానుబంధ ప్రజాకార్యకలాపాల కోసమూ ఎమర్జెన్సీలో తీవ్ర నిర్బంధానికి గురైన వాళ్ళు బి.విజయకుమార్, నారదాసు లక్ష్మణరావులు. చిన లక్ష్మణరావుగా పిలుచుకునే నారదాసు లక్ష్మణరావు వీపుపై ఎమర్జెన్సీలో పోలీసులు పెట్రోలు పోసి తగులబెట్టారు. (ఇప్పటికీ ఆ వీపు మీద ఆ గాయపు కాయ ఉంటుంది. ఇపుడు పోలీసు అఘాయిత్యాల గురించి మాట్లాడుతున్న తెలంగాణ వాదులు భూస్వామ్య, సామ్రాజ్యవాద దళారీ ప్రభుత్వ స్వభావాలను ఇటువంటి అనుభవాలతో అర్థం చేసుకోగలిగితే ఈ పోరాటం శత్రువును పోల్చుకొని ముందుకుసాగే పాఠాలనిస్తుందని గుర్తు చేయడానికే ఈ విషయం రాస్తున్నాను.) ఓపికగా లెక్కపెడుతూ బి. విజయ్‌కుమార్ తలపై ఉన్న వెంట్రుకలన్నీ ఒక్కొక్కటే పీకుతూ ఆయనది బోడితల చేసిగానీ పోలీసులు తమ కసితీర్చుకోలేదు. ఉమ్మెంతల వెంకటరెడ్డిని తాడిగిరి పోతరాజు, శనిగరం వెంకటేశ్వర్లుతో పాటు బంగ్లాదేశ్ యుద్ధం (1971) రోజుల్లో 'పిడి' చట్టం కింద అరెస్టు చేశారు. అట్లే గోపు లింగారెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్ళాడు.

బీఎస్సీ పూర్తి చేసి ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎ.తెలుగులో చేరిన దగ్గర్నించీ 1974 దాకా విరసం సిటీ యూనిట్‌కు గోపులింగారెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించాడు. ఆర్టిస్టు చంద్ర ఇంట్లోనూ, కథా, నాటక రచయిత సి.ఎస్.రావు ఇంట్లోనూ తరచుగా విరసం సిటీ యూనిట్ సమావేశాలు జరుగుతుండేవి. అప్పుడు విరసంలో జ్వాల, నిఖిల్, చెర, ఎం.టి.ఖాన్, శ్రీపతి, చంద్ర, సి.ఎస్.రావు మొదలైన వాళ్ళంతా సిటీ యూనిట్ సభ్యులేనని గుర్తు చేసుకున్నపుడు కన్వీనర్‌గా గోపు లింగారెడ్డిది ఎంత కత్తిమీద సామో

అర్థమవుతుంది. విరసంలో 1985 దాకా అన్నీ ఘర్షణలూ పొలిమికలే. అంటే మార్క్సిస్ట్ ఉద్యమంలో పంథా గురించి గాక ఎత్తుగడల గురించిన చర్చలే.

సాయుధ పోరాటాలే ఏకైక మార్గం అంటే చారు మజుందార్ లైన్ అనీ, వ్యవసాయ విప్లవం అంటే చంద్ర పుల్లారెడ్డి లైన్ అనీ, భూ పోరాటాలే అంటే నాగిరెడ్డి లైన్ అనీ, అట్లా ఆ ముగ్గురూ చెప్పినా చెప్పకపోయినా, స్వయంగా కె.ఎస్. ఆ విభజన యాంత్రికమైందని అన్నా అట్లా అనుకున్న యవ్వనోద్రేక కాలమది. 1971 ఆగస్ట్‌లో పిడి చట్టం కింద అరెస్టయి, విడుదలయ్యాక జ్వాలాముఖీ, నిఖిలేశ్వర్‌లు అప్పుడు టి.ఎన్.లైన్‌గా, ఇప్పుడు డి.వి. లైన్‌గా పేర్కొంటున్న విప్లవ పంథావైపు మొగ్గారు. అంతే తీవ్రంగా చెరబండరాజు చారుమజుందార్ లైన్‌వైపు మొగ్గి 'ఊరు మేలుకున్నది' వంటి దీర్ఘ కవిత, మరికొన్ని పొలిటికల్ కవితలు కూడా రాసాడు. విరసం సిటీ యూనిట్ ఇటువంటి సిద్ధాంత విభేదాల యుద్ధ భూమిగా ఉండేది. యూనిట్ సమావేశం ముగియగానే ముగ్గురు పూర్వాశ్రమ దిగంబర కవులు చెట్టపట్టాలేసుకొని సైకిళ్ళపై వెళ్ళిపోయే పాత స్నేహితులే. 1974 జనవరిలో కర్నూలులో విరసం మహాసభలు జరిగే నాటికి వేరుకుంపట్లు పెట్టుకునే వాతావరణం ఏర్పడింది. సభా ప్రవేశం ముందు మార్క్స్ ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ బొమ్మలు కర్నూలు విరసం యూనిట్ పెడితే, సిటీ యూనిట్ మరొకవైపు చారు మజుందార్ బొమ్మ పెట్టింది. అంతేకాదు 'ఉన్నదొక్కటే దారి చారు మజుందారి' అని కూడా రాసింది. 'చారు మజుందారి' అనే పదబంధం తయారు చేసినవాడు శ్రీశ్రీ. ఆయన శబ్దతౌల్యం మనకు తెలిసిందే. ఆ తర్వాత 'చారుమజుందారి' పేరుతో బి.నర్సింగరావు సంపాదకత్వంలో కవితా సంకలనమే వెలువడింది. ఇంక కర్నూలు సభల్లో భోజనాల సమయంలో 'చారు' కావాలన్న దగ్గర్నించి ఊరేగింపులో 'ఉన్నదొక్క టే దారి చారు మజుందారి' నినాదాల దాకా ఆ వీరావేశం ఆ అభినివేశం అందులో గోపు లింగారెడ్డి, కొల్లూరి చిరంజీవి, నల్ల మల్లారెడ్డి, ప్రభంజన్ వంటి వాళ్ళను ఇప్పుడు ఊహించుకుంటే ఎంత చిత్తశుద్ధితో కూడిన సెక్టేరియనిజం ఉన్న రోజులవి అని అబ్బురమనిపిస్తుంది. అయితే కర్నూలు సభల తర్వాత కె.ఎస్. ఈ అన్ని విషయాలను సమీక్షిస్తూ సుతిమెత్తగా చురకలు పెట్టాడు. (ఇటువంటి యువోద్రేకానికంతా విరసంలో నాయకత్వం ఇచ్చిన బాధ్యత చెరబండరాజు, నేను తీసుకోవాల్సిందే కదా.) 'చారు మజుందారి అయితే మావో ఆలోచనా విధానం సంగతి ఏమిటి మరి' అన్నాడు. కె.ఎస్. 'కవిత్వంలో పదబంధమైంది రాజకీయాల్లో పంథా అనుకుంటే ఎట్లా? ఈ కాలపు మార్క్సిజం లెనినిజమైన మావో ఆలోచనా విధానాన్ని భారత విప్లవానికి నక్సల్బరీ పంథా ద్వారా అన్వయించ ప్రయత్నం చేసినవాడే. ఈ దేశ పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు

అవుతాడు చారు మజుందార్' అన్నాడు కె.ఎస్. 'ఊరేగింపులో ఆ నినాదం ప్రజల నుంచి వస్తే వేరు గానీ విరసం వంటి సంస్థలో బాధ్యులుగా ఉన్నవాళ్ళే ఇచ్చి ఉండాల్సింది కాదన్నాడు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కొండపల్లి సీతారామయ్య సహచరుడు, ఆ తర్వాత కాలంలో సిద్ధిపేటలో హిందీ పండిట్‌గా పనిచేసిన వెంకటేశ్వర రెడ్డి కుమార్తె అరుణతో లింగారెడ్డి వివాహం కూడా ఒక విప్లవ సాంస్కృతిక కార్యక్రమమే. అప్పటికే అక్కడ సుప్రసిద్ధ న్యాయవాదిగా ఉన్న చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ సభ జరిగింది. అపుడప్పుడే సిద్ధిపేటలో సూరపనేని జనార్ధన్ నాయకత్వంలో అజ్ఞాత విప్లవోద్యమం ప్రవేశిస్తున్నది. (చల్లా నరసింహారెడ్డి ఎమర్జెన్సీలో జైలు పాలయ్యారు కూడ) తెలుగు లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరిన తర్వాత గోపు లింగారెడ్డి జానపద సాహిత్యంలో కృషికి అంకితయ్యాడు. బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణ కుమారిల మెప్పు పొందాడు. శ్రామిక గేయాల మీద పరిశోధన చేశాడు. ఇంక కరీంనగర్‌లో ఆయన బహుముఖ కార్యకలాపాల్లో ఒకటైన సాహిత్య క్షేత్రం గురించి నాకంటే చెప్పగలిగిన సన్నిహితులు చెప్తూనే ఉన్నారు.

తెలంగాణ విద్యావంతుల వేదికకు ఆయన కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా చాల క్రియాశీలకంగా పనిచేసాడు. రెగ్యులర్‌గా 'ప్రజా తంత్ర' లో రాస్తుండేవాడు. చొరవ ఉన్న మనిషి, శ్రామిక గేయాలు పరిశోధనా గ్రంథం పునర్ముద్రణ జరిగినపుడు నాతో ముందుమాట రాయించాడు. ఆ పుస్తకావిష్కరణకు కూడా పిలిచాడు. ఆయన కుటుంబంలో వచ్చిన సమస్యల వల్ల కూడా మళ్ళా ఆయన నాకు సన్నిహితుడయ్యాడు. నేను సహాయమూ చేయలేకపోయాను గానీ తరచూ మాట్లాడుకుంటుండేవాళ్ళం.

'జగిత్యాల జైత్రయాత్ర' ముప్పైఏళ్ళ తర్వాత తెలంగాణ విద్యావంతుల వేదిక జగిత్యాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెలంగాణ సదస్సులో పాల్గొనడానికి కోదండరామ్, పిట్టల రవీందర్‌లతో పాటు వెళ్తూ కరీంనగర్‌లో లింగారెడ్డిని ఆయన ఇంట్లో ఆఖరిసారి చూసాను. పరస్పరం చూసుకొని, మాట్లాడుకోవడం కాదు. కేవలం ఆ స్థితిలో చూడడమే. అందుకే అప్పటికీ ఇప్పటికీ నాకు విరసం సిటీ యూనిట్ వేడి వేడి సమావేశాలు, కర్నూలు విరసం మహాసభలు వాటిలో గోపు లింగారెడ్డి యవ్వనోద్రేక విశ్వాస ప్రకటనలు, నినాదాలే గుర్తుకొస్తున్నాయి. మనుషుల్ని అట్లా సజీవ చైతన్యంతో గుర్తుపెట్టుకోవడమే బతికున్న వాళ్ళ ఆరోగ్యానికి మంచిదనుకుంటాను.

**– వరవరరావు**

06.11.2011, నమస్తే తెలంగాణ

# తెలంగాణ జానపద సాహిత్యకారుడు డా॥ గోపు లింగారెడ్డి ఇక లేరు

తెలంగాణ జానపద సాహిత్యంలో విశేషంగా పరిశోధన గావించి, తెలంగాణ శ్రామిక గేయాలు సిదాంత రచన ద్వారా జానపద సాహిత్యకారుడిగా పేరు తెచ్చుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥గోపు లింగారెడ్డి (62) అక్టోబర్ 31న మృతి చెందారు. కరీంనగర్‌లోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గత నాలుగు దశాబ్ధాల నుండి తెలంగాణలోని పది జిల్లాలలో పర్యటించి జానపద సాహిత్య సమాచారాన్ని, పాటలను సేకరించి గ్రంధస్థం చేశారు. ఆయన సేకరించిన జానపద గేయాలు అనుభవాలను సైతం పుస్తక రూపంలో వెలువరించారు. తెలంగాణ జానపద సాహిత్యాన్ని శిష్ట సాహిత్యంతో సమానంగా పరిగణించబడడానికి ఆయన చేసిన కృషి, పరిశోధనలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. జానపద సాహిత్య చక్రవర్తి డా॥ బిరుదురాజు రామరాజు తర్వాత ఆయన జానపద సాయిత్యాన్ని అధ్యయనం చేయడమే కాకుండా జానపద విజ్ఞానంగా తీర్చిదిద్దారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డితో సహా జానపద సాహిత్యం తో సంబంధమున్న ఎందరెందరితో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 1970 దశకం ప్రారంభంలో విరసం ఏర్పాటులో తనవంతు కృషి సాగించారు. కరీంనగర్ నుండి వెలువడుతున్న విద్యుల్లత పత్రికకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. ఆయన రాసిన తెలంగాణ శ్రామిక గేయాలు, పాటల బాటసారిగా గ్రంధాలు తెలుగు సాహిత్య లోకంలో చక్కటి పేరును తెచ్చుకోవడమే కాకుండా ద్వితీయ ముద్రణకు నోచుకున్నాయి. 1968-69లో తెలంగాణ ఉద్యమంలో చురుకైన విద్యార్ధి కార్యకర్తగా పాల్గొన్నారు. జమ్మికుంట ఆదర్శ కళాశాల విద్యార్ధిగా ఆయన తెలంగాణ ఉద్యమానికి ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లాశాఖ స్థాపకాధ్యక్షులుగా, కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమ కార్యక్రమాల్లో ధూం ధాం సాంస్కృతిక కార్యక్రమంలో చురుకైన నాయకునిగా పనిచేశారు. 33 సంవత్సరాలపాటు తెలుగు ఉపన్యాసకుడిగా పనిచేసి వేలాదిమంది విద్యార్ధుల హృదయాలలో ఆత్మీయ గురువుగా స్థానాన్ని సంపాదించుకున్నారు. తెలుగు చిత్రసీమలోని వివిధ అంశాలపై ఆయనకు చక్కటి ప్రవేశం ఉండడమే కాకుండా చిన్నితెర చిత్రాలు, వెండితెర వెలుగునీడలు

అనే గ్రంథాలను వెలువరించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షునిగా ఉన్న కాలంలో ఆచార్య జయశంకర్, కోదండరామ్, దేశపతి శ్రీనివాస్, శ్రీధర్‌రావు దేశపాండే, మల్లేపల్లి లక్ష్మయ్య, పిట్టల రవీందర్ తదితరులతో సభలను నిర్వహించి తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని విస్తరించడంలో తనవంతు పాత్ర నిర్వహించారు. అంతర్జాతీయ చిత్రకారుడు డా॥ పాకాల తిరుమలరెడ్డి (పి.టి.రెడ్డి) కళాపరిషత్ అధ్యక్షునిగా పనిచేసి చిత్రకళారంగంలోని ప్రముఖ చిత్రకారులను గుర్తించి వారికి అవార్డులు దక్కేలా చేశారు. డా॥ కాపు రాజయ్య, ఆచార్య, జగదీశ్వరాచారి, అబ్దుల్ మనాన్ తదితరులు పి.టి.రెడ్డి చిత్రకళా పురస్కారాలను పొందిన వారిలో ఉన్నారు.

## అంత్యక్రియలు:

డా॥ గోపు లింగారెడ్డి అంత్యక్రియలు నవంబర్ 1న కరీంనగర్‌లో వందలాదిమంది అభిమానులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగాయి. గత మూడు సంవత్సరాల నుండి డా॥ లింగారెడ్డి మెదడు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. కరీంనగర్ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీమంత్రి కరీంనగర్ టిఆర్ఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు కెప్టెన్ లక్ష్మికాంతరావు, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ కె. మురళి, తెలంగాణ రచయితల వేదిక బాధ్యులు ఎస్. నాగేంద్ర శర్మ, జి. నాగభూషణం, సాహితీ గౌతమి అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్, డా॥ బి వి ఎస్ స్వామి, శతాధిక గ్రంథకర్త డా॥ మలయశ్రీ, ఆచార్యులు డా॥ ముత్యం, సందినేని రవీందర్, అదువాల సుజాత, చక్రధరస్వామి, లోక్‌సత్తా బాధ్యులు నరెడ్ల శ్రీనివాస్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసిన వారిలోఉన్నారు

డా॥ రెడ్డికి భార్య అరుణతో పాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## డా॥ గోపు లింగారెడ్డి సాహిత్య జీవిత పరిచయం :

తెలంగాణా రాష్ట్ర సాధనకై జరుగుతున్న సాంస్కృతిక సాహిత్యోద్యమాలలో చురుకుగా గత పదేళ్ల నుండి పాల్గొంటు తనకంటూ ప్రత్యేక ఒరవడిని సృష్టించుకున్న సాహిత్యోద్యమ నేత డా॥ గోపు లింగారెడ్డి. ఈయన రాసిన “తెలంగాణ శ్రామిక గేయాలు” అన్న సిద్ధాంత గ్రంధాన్ని 2008లో కరీంనగర్‌లోని వాణీ నికేతన్ డిగ్రీ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన సభలో ప్రముఖ విప్లవకవి వరవరరావు ఆవిష్కరిస్తూ ప్రశంసించారు. రైతులు ప్రభుత్వ దోపిడీలకు, పాలకవర్గాలు, బహుళజాతి సంస్థల కుట్రలకు బలవుతూ అణగదొక్క బడుతున్నారని, పనినుండే పాటపుట్టిన, వీరికష్టాల బతుకులను గట్టెక్కించే రీతిలో పాట

చైతన్యవంతమై రాణించిందని అన్నారు. పాట తెలంగాణలో రజాకార్ల వ్యతిరేకోద్యమానికి, నైజాం విముక్త, రైతాంగ పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచిందని అన్నారు. ఈ కోవలో డా॥ గోపులింగారెడ్డి, సేకరించి గ్రంథస్థం చేసిన "శ్రామిక గేయాలు" చైతన్యస్ఫూర్తితో వుందని కితాబునిచ్చారు. డా॥ గోపు సాహిత్యోద్యమ నేపథ్యం నుండే ఈ రచన రావడం వూహించని పరిణామమేమి కాదని అన్నారు. ఇదే పుస్తకం ద్వితీయ ముద్రణగా రావడం ఇక్కడి ప్రజల పోరాట ఉద్యమ ఆకాంక్షలను సాఫల్యం చేయడానికేనని అన్నారు. ఈ సభకు తెలంగాణా రచయితల వేదిక అధ్యక్షులు జూకంటి జగన్నాథం అధ్యక్షత వహిస్తూ, ప్రపంచీకరణ, పారిశ్రామీకీకరణ పెరిగిన నేటి కాలంలో ఇలాంటి పాటలు గ్రామాల్లో వచ్చే అవకాశాలు "జీరో" అయిపోయాయని అన్నారు. నేటి తరానికి డా॥ గోపు అందించిన జానపద గేయాల సాహిత్య మూటగా పేర్కొన్నారు. పది గ్రంథ రచనలు చేశారు.

## జననం :

కరీంనగర్‌కు సమీపంలో అల్గునూర్ మధ్యరైతు కుటుంబంలో 1-05-1950లో జన్మించిన లింగారెడ్డి, గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగారు. వేములవాడ రాజన్న వర ప్రసాదిగా "కోడె దూడగా" పెరిగారు. పల్లెటూరు సోయగాలను నింపుకొని, కరీంనగర్‌లో 1969లో డిగ్రీ చేసి హైదరాబాద్‌లోని 1971-73లో ఎహైదరాబాద్, ఉస్మానియా విశ్వ విద్యాలయం ద్వారా ఎంఏ తెలుగులో జానపదం ఐచ్ఛికంగా ప్రవేశ పట్టాగా, అదే తొలి బ్యాచ్‌లో ఎంఏ చేసి, ఆ తదుపరి వివిధ విద్యా సంస్థలలో పనిచేసి, 1975 నుండి తెలుగు జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు. జమ్మికుమట కాలేజిలో చదువుతున్నప్పుడు 1969లో జరిగిన జై తెలంగాణా పేరిట జరిగిన విద్యార్థుల ఉద్యమంలో పాల్గొని, జైలుకెళ్ళి, ఒక సంవత్సరం విద్యను నష్టం చేసుకున్నారు. అదే సమయంలో బి.విజయ్ కుమార్, వి.వెంకట్ రెడ్డిలతో కలిసి, "విద్యుల్లత" అనే మాసపత్రికను సుమారు రెండు సంవత్సరాల వరకు నిర్వహిమచి, సంచలనం సృష్టించారు. వచ్చిన ఇరువై సంచికల్లో విలువైన సాహిత్య సమాచారాన్ని అమదిమచారు. సాహిత్య, విప్లవాంశాలతో ఈ పత్రిక సంచికలు నాటికి, నేటికి రెఫరెన్స్ బుక్స్‌గా ఉపయోగపడుతున్నాయి.

## పదవులు:

రాష్ట్ర జానపద కళాపరిశోధన వేదికకు అధ్యక్షులుగా, కరీంనగర్ సాహితీ గౌతమి స్థాపకాధ్యక్షులుగా, జిల్లా అధికార భాషా సంఘం సభ్యులుగా, కాకతీయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపక సమాఖ్య అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్

ఉపాధ్యక్షులుగా వివిధ పదవుల్లో కొనసాగారు. కరీంనగర్ అర్బన్ బ్యాంకు అధ్యక్షునిగా ఎన్నికై సేవలనందించారు. లయన్స్ క్లబ్, బాల వికాస సమితిలో పదవులు నిర్వహించారు. వీరి ఉద్యమ భాగస్వామ్యం సాహిత్య, తెలంగాణావాద సంస్థలలో అప్రతిహితంగా కొనసాగింది.

జానపద విజ్ఞానంపై పరిశోధన: జానపద సాహిత్యకారుడిగా ఎదిగిన లింగారెడ్డి గత మూడున్నర దశాబ్దాల నుండి జానపద సాహిత్య, జానపద విజ్ఞాన కార్యక్రమాలకు జీవగర్రగా నిలిచారు. ఆధునిక సాహిత్యంతోపాటు, మౌకిక సాహిత్య రూపమైన జానపద విజ్ఞానానికి ఎంతో భవిష్యత్తు ఉందని అపార పరిశోధనా మహత్తు వుందని జానపద సాహిత్య పరిషత్ ద్వారా చాటి చెప్పారు. తొలి జానపద విజ్ఞాని ఆచార్య బి రామరాజు గౌరవాధ్యక్షులుగా, గోపులింగారెడ్డి స్థాపక కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్ ఆవిర్భావం 70వ దశకంలో జరిగింది. ఆచార్య నాయిని కృష్ణకుమారి, యశోదారెడ్డి, నేదునూరి గంగాధరం, జివిస్ మోహన్, ఆర్వీఎస్ సుందరం తదితర విద్యావేత్తలతో కలిసి ఎన్నెన్నో జానపద సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. 1972 నుండి జానపద సాహిత్య విజ్ఞానంపై అనేక వ్యాసాలు రాశారు. హైదరాబాద్, జైపూర్, బెంగుళూర్, వరంగల్, నెల్లూర్, కరీంనగర్ వివిధ చోట్ల జరిగిన జాతీయ సెమినార్‌లలో సాహిత్య, జానపద విజ్ఞానంపై పత్ర సమర్పణలు చేశారు. రావి ప్రేమలత, సుమతి, సరస్వతి, వసుంధర మొదలగు వారు వీరికి జానపద ఎంఏలో సహాధ్యాయులుగా వున్నారు.

## ఎంఫిల్/పిహెచ్‌డి :

ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి ప్రొఫెసర్ డా. నాయిని కృష్ణ కుమారి మార్గదర్శకత్వంలో పిహెచ్‌డి చేశారు. వీరు 1975లో తెలంగాణా శ్రామిక గేయాలు అన్న అంశంపై ఎంఫిల్ పూర్తి చేశారు. 1980లో ఇదే అంశంపై పిహెచ్‌డి పూర్తి చేశారు. తొమ్మిది తెలంగాణా జిల్లాలో ఏడు సంవత్సరాలు పర్యటించి సుమారు రెండువేల జానపద గేయాలను, పాటలను సేకరించారు.

## తెలంగాణా వాదిగా :

2004 సాధారణ ఎన్నికలతో పాటు, 2006, 2008లో జరిగిన ఉప ఎన్నికలలో తెలంగాణా అభ్యర్థుల విజయానికి తెలంగాణా విద్యావంతుల వేదిక నుండి పనిచేశారు. ప్రొ॥ జయశంకర్, విద్యాసాగర్, గద్దర్, దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి తెలంగాణా ధూం ధాంల నిర్వహణలో పాలుపంచుకున్నారు.

## తెలంగాణా శ్రామిక గేయాలు :

(జానపద సాహిత్య పరిశోధక గ్రంథం) జానపద సాహిత్యంలో శ్రమజీవుల పాత్ర అనిర్వచనీయం. పొలం పనులు చేసేటప్పుడు వీరు వివిధ ప్రక్రియల్లో పాడే పాటలు జానపద సాహిత్యంగా రూపుదిద్దుకున్నాయి. విత్తనాలు విత్తేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, మోటకొట్టేటప్పుడు, వరికోతలప్పుడు, కల్లం వేసేటప్పుడు తమ శ్రమను మరవడానికి పాడే పాటలను డా॥ గోపు లింగారెడ్డి ఆరేడేళ్ళ పాటు ఊరూరా తిరిగి రికార్డు చేశారు. వాటిని విశ్లేషించి తన పరిశోధనను పూర్తి చేశారు. 3 వందల పుటలున్న గ్రంథమిది. 1980లో తన పరిశోధనను పూర్తి చేయగా, 1982లో మొదటి ప్రచురణ వేశారు. తదుపరి 26 ఏళ్ళ తర్వాత 2008లో ద్వితీయ ముద్రణను వేశారు. ఇందులో ఎనిమిది అధ్యాయాలను చేర్చి శ్రామిక గేయాలను విశ్లేషించారు.

## ఇతర గ్రంథాలు:

కరీంనగర్ జిల్లా జానపద గేయాలు, ఉషః కిరణాలు, జానపద విజ్ఞానం, అనుభవాలు, బతుకమ్మ పండుగ, జానపద పరిశోధన త్రైమాసిక సంచికలు, పాటల బాటసారిగా, వెండితెర వెలుగునీడలు, చిన్నితెర చిత్రాలు వీరి ఇతర గ్రంథాలు.

## పాటల బాటసారి

'ఈ వ్యాస సంకలనంలో 13 వ్యాసాలను రాశారు. ఇది రెండవ ముద్రణకు నోచుకుంది. ఇందులో జానపదుల గేయస్రవంతి, జానపదుల మనస్తత్వం, సంక్రాంతి, తెలుగు సినిమా పాటలు – జానపద పాటలను పేరడీలు, చిత్రకారులు డా॥ పి.టి.రెడ్డి, డా॥ కాపు రాజయ్య, జిల్లా శ్రామిక విజ్ఞాన కృషి, బతుకమ్మ పండుగ తదితర అంశాలపై చర్చించారు.

సినిమా రంగంపై వీరికి ఎక్కువ మక్కువ. చిత్రరంగంపై వీరు రాసిన పలు వ్యాసాలు ఆంధ్రభూమిలో వచ్చేవి. ఈ వ్యాసాలనే చిన్ని తెర చిత్రాలు, వెండితెర వెలుగు నీడలు అన్న గ్రంథాలు మలిచారు. టీవీ అవార్డుల నందుల కమిటీలో సభ్యునిగా పనిచేశారు. ఇవేకాక 2001, 2006, 2008 లలో కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సదస్సులలో వీరు కీలక పాత్రను పోషించారు. కాళోజీ, దాశరధి రంగాచార్య, ఆచార్య జయధీర్ తిరుమలరావు తదితరులెందరో కళాశాల సదస్సులకు హాజరయ్యారు. వికాస సాహితీ స్థాపక అధ్యక్షులుగా పనిచేస్తూ, పలు కార్యక్రమాలను

నిర్వహించారు. పాజిటివ్ థింకర్స్ క్లబ్, ఫిలిం సొసైటి, సమైక్య సాహితీ, జిల్లా అధికార భాషా సంఘంలో వీరి పాత్ర ఎంతో ఉంది. పలు యూనివర్సిటీల్లో కౌన్సిలర్‌గా, పరిశోధకులకు గైడ్‌గా పనిచేశారు. పట్టణ జానపద విజ్ఞాన సేకరణలో, తెలంగాణా పదకోశం ప్రాజెక్టు తయారీలో తలమునకలై ఉండగా ఆయన అస్వస్థతకు గురయ్యారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన / ఆత్మీయ సమ్మేళనం :

డా॥ గోపు లింగారెడ్డి సాహిత్యోద్యమకారుడే కాకుండా పదాన్యుడిగా ముందుకు వచ్చారు. 2008 ఆగస్ట్ 13న తాను లెక్చరర్‌గా పనిచేసిన కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఋణం తీర్చుకోవడానికి సుమారు ఒక లక్ష రూపాయల వ్యయంతో నాలుగున్నర అడుగుల ఎత్తుగల శ్రీ రాజ రాజేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. డా॥ గోపు లింగారెడ్డి సాహిత్య జీవితంపై ప్రచురించిన "జానపద గోపురం" అభినందన సంచికను ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు ఆవిష్కరించారు.

***- సంకేపల్లి నాగేంద్రశర్మ***

సెల్: 9346814782

నేటి నిజం
03.11.2011

తెలంగాణ జానపద సాహిత్యంలో విశేషంగా పరిశోధన గావించి, తెలంగాణ శ్రామిక గేయాలు సిదాంత రచన ద్వారా జానపద సాహిత్యకారుడిగా పేరు తెచ్చుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥గోపు లింగారెడ్డి (62) అక్టోబర్ 31 2011న మృతి చెందారు. కరీంనగర్‌లోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గత నాలుగు దశాబ్దాల నుండి తెలంగాణలోని పది జిల్లాలలో పర్యటించి జానపద సాహిత్య సమాచారాన్ని, పాటలను సేకరించి గ్రంథస్థం చేశారు. ఆయన సేకరించిన జానపద గేయాలు అనుభవాలను సైతం పుస్తక రూపంలో వెలువరించారు.

# తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురణలు


















తెలంగాణ రాష్ట్ర సాధనకై జరుగుతున్న సాంస్కృతిక సాహిత్యోద్యమాలలో చురుకుగా గత పదేళ్ల నుండి పాల్గొంటూ తనకంటూ ప్రత్యేక ఒరవడిని సృష్టించుకున్న సాహిత్యోద్యమ నేత డా॥ గోపు లింగారెడ్డి.

**– తెలంగాణ రిసోర్చ్ సెంటర్**



లింగారెడ్డి మరణంతో...
జానపద "గోపు"రం కూలిపోయింది!
సాహితీ లోకం చిన్నబోయింది!
పాటల బాటసారిగా...
ఆయన చేసిన కృషి ప్రశంసనీయం!
శ్రామిక జనంతో మమేకమై...
సేకరించిన గేయాలు
ఆయన సృజనకు ప్రతిరూపాలు!
'చిన్ని తెర చిత్రాలు'
'వెండి తెర వెలుగు నీడలు' వంటి గ్రంథాలు
ఆయన కీర్తిని...
ప్రకాశమానం చేసే మణిదీపాలు!
తెలంగాణ వాదాన్ని...
నినదించిన ఆయన గళం
నేడు మూగబోతేనేం!
ఆయన సృష్టించిన
జానపద సంపద మాత్రం
ఉంటుంది శాశ్వతంగా

**– దాస్యం సేనాధిపతి**

TELANGANA RESOURCE CENTRE
"CHANDRAM", 490, St. No. 11, Himayatnagar, Hyderabad-500 029.
trchyd@gmail.com; Mobile : 9030626288